# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 144 గుంటూరు, మంగళవారం 03- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.


సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# క్రైమ్ కౌంటర్ క్యాలెండర్ ఆవిష్కరించిన

# పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్




క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం : క్రైంకౌంటర్ తెలుగు దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సోమవారం ఆవిష్కరించారు . గత పది రోజులుగా ఆయన కలవాలన్న ఎమ్మెల్యే బిజీ ఉండటంతో కలవలేకపోవడం జరిగింది సోమవారం అమరావతి మండలం అత్తలూరు గ్రామంలో వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చేత క్రైమ్ కౌంటర్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు . సమాజంలో ఉన్న అవినీతి అక్రమాలను విలేకరులు బయటకు తీసుకురావాలని తద్వారా సమాజంలో ఏం జరుగుతుందో ప్రభుత్వానికి అధికారులకే తెలుస్తుంది అని అన్నారు . జర్నలిజం గౌరవ ప్రధానమైన వృత్తి అని అందుకే దేశంలో నాలుగో స్తంభంగా నిలబడిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో అమరావతి ఎమ్మార్వో డేనియల్, మండల పార్టీ అధ్యక్షులు మంచినేని రాజా, అత్తులూరు నాయకులు నెట్టం హరిబాబు, చిలంకూరి వెంగళరావు, వెంకట్, గంటా రాజేష్, తదితరులు పాల్గొన్నారు

## లండన్‌కు మంత్రి నారాయణ.. కీలక ప్రాజెక్టుల పరిశీలన




క్రైమ్ కౌంటర్ న్యూస్) లండన్/అమరావతి, ఫిబ్రవరి 2: అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టులను అధ్యయనం చేసేందుకు గానూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బృందం లండన్ చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా అక్కడ పలు కీలక ప్రాజెక్టులను పరిశీలించి, అమరావతిలో అమలు చేయగలిగే ఆధునిక పట్టణ ప్రణాళిక, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై నారాయణ బృందం అధ్యయనం చేయనుంది. లండన్ కాలమానం ప్రకారం.. ఉదయం 11:00 గంటలకు లండన్ సిటీ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ గ్విన్ రిచర్డ్స్‌తో మంత్రి సమావేశం కానున్నారు. ఈ భేటీలో అమరావతి అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, అంతర్జాతీయ సహకార అవకాశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్యాహ్నం 1:30 గంటలకు బెటర్సీ పవర్ స్టేషన్‌నునారాయణ బృందం సందర్శించనుంది. అనంతరం థేమ్స్ రివర్ ఫ్రంట్ ప్రాంతాన్ని పరిశీలించనుంది. సాయంత్రం 4:30 గంటలకు లండన్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి.. అక్కడి బ్రిడ్జ్, సరౌండింగ్ ఏరియాల అభివృద్ధి, ట్రాన్స్‌పోర్ట్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను అధ్యయనం చేయనుంది. ఈ బృందంలో మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్‌లు ఉన్నారు. ఈ పర్యటన ద్వారా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఆధునిక ఆలోచనలు, టెక్నాలజీలు సేకరించడమే లక్ష్యమని తెలుస్తోంది. ఈ నెల 2, 3 తేదీల్లో లండన్‌లో.. 4, 5 తేదీల్లో దోహాలో ఈ బృందం పర్యటించనుంది.

## రాజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతం..

## జగన్ అండ్ కోపై సీఎం చంద్రబాబు ఫైర్

క్రైమ్ కౌంటర్ న్యూస్)అమరావతి, ఫిబ్రవరి 2 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరోసారి రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా నిలిచింది. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుచేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 2024 తర్వాతే ఏపీలో రూల్ ఆఫ్ లా అమలు..

సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతిభద్రతల పునరుద్ధరణ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఆయన



హెచ్చరించారు.వైసీపీలో అసహనం..

రాష్ట్రంలో జరుగుతున్న పున: నిర్మాణ ప్రక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

ప్రజాసేవే లక్ష్యం.. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

## శివ స్వాముల గ్రామోత్సవం.!!



**పెద్దవడుగూరు – జనవరి(2) క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** మండల కేంద్రంలో పెద్దవడుగూరు, పేట ఉమామహేశ్వర శివాలయంలో మాలాధారణ శివ స్వాములు సోమవారం అత్యంత వైభవంగా గ్రామోత్సవం చేపట్టారు. ఈసందర్భంగా గత నెల రోజులుగా ఆలయంలో శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు అర్చనలు చేపట్టారు. పడిపూజ, గ్రామోత్సవం శివ మాలధారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి. శివాలయం లో శివ స్వాముల మాలదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దైవ దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ మంగళవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని శివ స్వాములు తెలిపారు .. అనంతరం శివ స్వాములు, భక్తులు శివుని ఉత్సవ విగ్రహాన్ని పెద్దవడుగూరు, ప్రధాన వీధుల గుండా ఉత్సవం విగ్రహంతో పూజలు నిర్వహించారు. మరి కొందరు స్వాములు భక్తులు భక్తితో పరవశమై నంది విగ్రహం తో నృత్యాలు చేపట్టారు. ఓం నమశ్శివాయ, శంభో శంకర అనే పదల తో స్థానికులు సైతం జతకట్టి పలికారు. ఈవిధంగా శివ నామస్మరణంతో గ్రామమంత అడుగడుగున స్వామివారికి భక్తులు బ్రహ్మరథం పట్టి ఉమామహేశ్వర స్వామి కి వారి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంల మాల ధారణ స్వాముల తో పాటు పెద్ద ఎత్తున భక్తులు,పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి వెన్నా ఆర్థిక సాయం

**(బెల్లంకొండ )(క్రైమ్ కౌంటర్)( నాయక్ )** మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన యాకసిరి రమణ(55)గుండె నొప్పితో మృతి చెందింది.రమణ మృతి విషయం తెలుసుకున్న టిడిపి మండల సీనియర్ నాయకులు కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

## డబ్బులు ఇయ్యాలన్నా ఖర్చు పెట్టాలన్న కొమ్మలపాటి శ్రీధరే



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** పేదలను ఆర్థికంగా ఆదుకోవాలన్నా డబ్బులు ఇయ్యాలన్న , ఖర్చు పెట్టాలన్న అది ఒక కొమ్మలపాటి శ్రీధరకే సరిపోయిందని పల్నాడు జిల్లా తెలుగు తమ్ముళ్లు అంటున్నారు . ఆపదంటే తెలుగుదేశం పార్టీ ఏ కార్యకర్త నైనా నాయకులైన ఆదుకున్న వ్యక్తిగా పల్నాడు జిల్లాలో పెదకూరపాడు నియోజకవర్గంలో శ్రీధర్ ప్రజల హృదయాల్లో స్థానం ఎవరు పూడ్చలేనిది అని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంటున్నాయి . తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం కృషి చేసే శ్రీధర్ ని పక్కన పెట్టడం కార్యకర్తలకి తలకాయ నొప్పిగా తయారయింది . అంతే గురు సమాజానికి మంచి చేసేవాడు పనికిరాడాని ప్రజల సైతం చెబుతున్నారు. ఇప్పుడు కైనా మంచి పోయింది ఏమీ లేదని వెంటనే శ్రీధర్ కూ తెలుగుదేశం పార్టీ పదవి ప్రకటించి ప్రజాక్షేత్రంలో నిలపాలని ప్రజలు కూడా బహిరంగంగా అంటున్నారు.

## రైతుల భూ హక్కులకు కొత్త పాస్‌బుక్ లు పంపిణీ

**ఫిబ్రవరి 02 క్రైమ్ కౌంటర్ న్యూస్):** కౌతాళం మండలం అగసలదిన్నె గ్రామంలో రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు కొత్త పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమం జరిగింది. సోమవారం జిల్లా ఉపాధ్యక్షుడు చూడి ఉలిగయ్య, తహసీల్దార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం భూ వివాదాలను పరిష్కరించి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని, గత ప్రభుత్వంలో జగన్ ఫోటోతో పాస్‌బుక్ ముద్రించడం రైతుల ఆస్తిని కాజేసే ప్రయత్నమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




## ప్రజా సేవే కూటమి ప్రభుత్వం లక్ష్యం ఎమ్మెల్యే ప్రవీణ్






**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా అమరావతి మండలం అత్తలూరులో నిర్వహించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ .ప్రజల సమస్యలను స్వయంగా విని వాటిని తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే.రెవెన్యూ,పెన్షన్లు,ఇంటి స్థలాల సమస్యల పై వచ్చిన అర్జీలను తీసుకుని సంబంధిత శాఖల అధికారులకు పంపి సమస్యలను పరిష్కరించేలా పని చేయాలన్న ఎమ్మెల్యే.ప్రతి ఒక్కరి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించేలా కృషి చేయాలన్న ఎమ్మెల్యే. రైతులను ఇబ్బంది పెట్టకుండా వినయంతో వారికి సమాధానం చెప్పాలన్న ఎమ్మెల్యే.కార్యక్రమంలో అత్తలూరు సొసైటీ చైర్పర్సన్ నాగోతు నాగార్జున, మంచినేని రాజా, నెట్టెం హరిబాబు, చిల్లంకూరి వెంగళరావు, గంటా రాజేష్ ఎమ్మార్వో , డిప్యూటీ ఎండిఓ , మండల పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్ నో పెట్రోల్ కచ్చితంగా అమలు చేయండి.








### నేషనల్ హైవే 44 పై ఉన్న పెట్రోల్ బంకుల్లో తనిఖీ పెద్దవడుగూరు, ఎస్సై ఆంజనేయులు,

**పెద్దవడుగూరు ఫిబ్రవరి 02 ( క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్)** అనంతపురం నగరంలో ఈ నిబంధన అమల్లోకి వచ్చింది . హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ ఇవ్వబోమని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం నగర పరిధిలో ఈ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి వాహనాదారుల ప్రాణాలను రక్షించడమే ప్రధాన ఉద్దేశం అని అధికారులు తెలిపారు హెల్మెట్ లేకుండా వాహనం నడిపినట్లైతే 1000 రూపాయలు జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోనున్నారు. పదేపదే నిబంధనలు ఉల్లంఘించినందుకు డ్రైవింగ్ లైసెన్సెస్ సస్పెన్షన్ చేసే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఈ డ్రైవ్ లో భాగంగా నేషనల్ హైవే 44 ఉన్న పెట్రోల్ బంకులను సోమవారం తనిఖీ చేయడం జరిగిందని పెద్దవడుగూరు, ఎస్సై ఆంజనేయులు తెలియజేశారు. వాహనదారులు హెల్మెట్లు ధరించి పెట్రోల్ పట్టించడానికి వచ్చిన వారిని పెద్దవడుగూరు, పోలీసులు అభినందించడం జరిగింది. అదేవిధంగా పెట్రోల్ పంపు యజమానులకు నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనను గట్టిగా అమలు ఇచ్చి పరచాలని పెద్దవడుగూరు, ఎస్సై ఆంజనేయులు, విజ్ఞప్తి చేశారు..

## జగన్.. ఇప్పుడు తలెక్కడ పెట్టుకుంటావు: వర్ల రామయ్య



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరావతి, ఫిబ్రవరి 2: స్కిల్ డెవలమెంట్ కేసుకు సంబంధించి మాజీ సీఎం జగన్‌పై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రప్రదేశ్‌ను వివిధ కులాలకు చెందిన ముఖ్యమంత్రులు.. రెడ్లు, బ్రాహ్మణులు, దళితులు, వెలమలు, బీసీలు, వైశ్యులు, కమ్మ వర్గాల వారు పరిపాలించారని, కానీ వారంతా రాజకీయ పోరాటాలు మాత్రమే చేశారని ఆయన అన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో కక్షలు, కార్పణ్యాలు, పగ, ద్వేషం, ప్రతీకారం, విధ్వంసం, ఫ్యాక్షనిజం, రాక్షస పరిపాలనకు తెర లేచిందని వ్యాఖ్యానించారు. అందులో భాగంగానే తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబు నాయుడును శత్రువుగా భావించిన జగన్.. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టి 53 రోజుల పాటు జైలుకు పంపారని మండిపడ్డారు. జైలులో బక్కెట్ వేడి నీళ్లు కూడా ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టి, మానసికంగా బాధలు కలిగించి కక్ష తీర్చుకున్నారని విమర్శించారు.ఏ సీఐడీ అయితే ఆయన్ను అరెస్ట్ చేసిందో.. ఇప్పుడు అదే సీఐడీ దర్యాప్తు కొనసాగించి, చంద్రబాబుపై ఎలాంటి తప్పు లేదని 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' కింద కేసును వాపసు తీసుకుందని తెలిపారు. ఆయనపై అవినీతి, షెల్ కంపెనీల ద్వారా డబ్బు తరలింపు వంటివి ఏమీ రుజువు కాలేదని స్పష్టం చేసిందని రామయ్య తెలిపారు. ఇటీవల ఈడీ కూడా విశాఖపట్నం కోర్టులో చంద్రబాబుకు ఈ కేసులో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసి, మిగతా వ్యక్తులపై మాత్రమే ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు చేసిందన్నారు. ఇది జగన్‌కు రెండో చెంపదెబ్బ అంటూ వర్ల రామయ్య వ్యాఖ్యానించారు.

దర్యాప్తు సంస్థలు స్కిల్ కేసులో చంద్రబాబుకు ఎలాంటి అవినీతి మరక లేదని చెప్పిన నేపథ్యంలో జగన్ ఇప్పుడు తలెక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. చంద్రబాబు జైలులో బందీగా ఉన్న 53 రోజుల జీవన కాలాన్ని కక్ష, కార్పణ్యాల ద్వారా దొంగిలించిన వ్యక్తి జగన్ అని ఆయన ఆరోపించారు. జగన్ 5 ఏళ్ల పాలన అరాచకమని, అప్రజాస్వామికమని, మహిళల పట్ల జుగుప్సాకరంగా వ్యవహరించిన తీరు గర్హణీయమన్నారు. చంద్రబాబును అక్రమంగా జైలులో బంధించినందుకు కోట్లాది మంది టీడీపీ కార్యకర్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చంద్రబాబు అభిమానులకు జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

# సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాల పర్యటన కార్యక్రమంలో భాగంగా అమరావతి మండలం అత్తలూరు గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశమైన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలే సచివాలయ సిబ్బంది పనిచేయాలన్న ఎమ్మెల్యే. గ్రామంలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న ఎమ్మెల్యే. సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకునివెంటనే పరిష్కరించాలని సూచించిన ఎమ్మెల్యే. రైతులతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యలు విని త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్న ఎమ్మెల్యే. అవినీతికి పాల్పడితే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంచి నేను రాజా , అత్తలూరు నాయకులు నెట్టెం హరిబాబు, మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అధికారం కోల్పోయిన జగన్‌లో మార్పు రాలేదు: ఎంపీ కలిశెట్టి

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** న్యూఢిల్లీ, ఫిబ్రవరి 02: ఆంధ్రప్రదేశ్‌లో కాపు సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడులు జరుగుతున్నాయంటూ వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని.. వారి వ్యాఖ్యలు చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. సోమవారం న్యూఢిల్లీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. కాపులతోపాటు బీసీ సామాజిక వర్గాల వారి మీద దాడి చేసిన ఘనత, చరిత్ర వైసీపీదేనని తెలిపారు. గత ఐదేళ్లలో టీడీపీ సీనియర్ నేతలు బోండా ఉమా, బుద్దా వెంకన్నతోపాటు పలువురు నేతలను హత్య చేసేందుకు బహిరంగ ప్రయత్నం చేశారంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డితోపాటు ఆయన బృందం.. కాపు, బీసీ సామాజిక వర్గాల వారిని నాశనం చేయడమే కాకుండా.. వారి మనోభావాలను దెబ్బతీశారని వివరించారు.



అంబటి రాంబాబు మాట్లాడిన తీరును తప్పని చెప్పకుండా ప్రభుత్వంపై ఎదురుదాడి చేసే విధంగా వైసీపీ నేతలు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వారు చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు ఛీ కొడుతున్నారని చెప్పారు. అభివృద్ధి వైపు వెళ్లాలని.. రెచ్చగొట్టే వ్యాఖ్యల వైపు వెళ్లొద్దంటూ సీఎం చంద్రబాబు తమకు స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ గుర్తు చేశారు.

అధికారం కోల్పోయినా ఇంకా వైఎస్ జగన్‌లో మార్పు రాలేదన్నారు. వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిపై టీడీపీ కార్యకర్త వ్యాఖ్యలు చేస్తే వెంటనే అరెస్టు చేసిన విషయాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు, లోకేశ్‌పై విమర్శలు చేస్తుంటే టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుని చూసి నేర్చుకోవాలంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సూచించారు. గతంలో టీడీపీ నేతలపై విమర్శలు చేస్తే కొందరికి వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పదవులను జగన్ ఇచ్చారని విజయనగరం ఎంపీ గుర్తు చేశారు. టీడీపీ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కాపు కార్పొరేషన్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని వివరించారు. కాపు సామాజికవర్గంతోపాటు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చింది టీడీపీ అని తెలిపారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించాలంటూ వైఎస్ జగన్‌కు ఎంపీ కలిశెట్టి సూచించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను చూసి నేర్చుకుంటున్నారంటూ వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు.

కాపులకు అన్యాయం జరుగుతుందంటూ ముద్రగడ పద్మనాభం లేఖలు ప్రభుత్వానికి రాస్తున్నారని.. మొన్ననే ఆయన రెడ్డిగా పేరు మార్చుకున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. కాపు జాతి కోసం ఉన్నారా? జగన్ కోసం ఉన్నారా? ఆలోచన చేయాలంటూ ముద్రగడ పద్మనాభంకు ఎంపీ కలిశెట్టి చురకలంటించారు.

మీ గౌరవాన్ని దిగజార్చుకోవద్దంటూ ముద్రగడ పద్మనాభంకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయడు హితవు పలికారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో అంతా విధ్వంసం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు ఎమర్జెన్సీ పెట్టాలని ప్రజలే కోరుకున్నారని వివరించారు. ఎమర్జెన్సీ కన్నా దారుణంగా జగన్ పరిపాలన జరిగిందంటూ మండిపడ్డారు. చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్ట్ చేశారని.. దాంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆందోళన చెందారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా పాలనా జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు.

# సభ్యసమాజం తలదించుకునేలా అంబటి వ్యాఖ్యలు: పురందేశ్వరి



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఢిల్లీ, ఫిబ్రవరి 2 : సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా అంబటి వ్యాఖ్యలున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు తల్లిని అవమానించే విధంగా అంబటి మాట్లాడారని ఆగ్రహించారు. మహిళా లోకం కూడా ఆయన వ్యాఖ్యలను సహించదని తెలిపారు. సోమవారం ఢిల్లీ వేదికగా మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు.

**కర్తవ్య స్ఫూర్తిని కొనసాగించేలా బడ్జెట్..**

వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందన్నారు పురందేశ్వరి. కర్తవ్య స్ఫూర్తిని కొనసాగించేలా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. వరుసగా తొమ్మిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధి కోసం 350 సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దేశాన్ని నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దక్కుతుందని ఉద్ఘాటించారు. పేదరికం నుంచి 25 కోట్ల మందిని బయటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

**పోలవరం ప్రాజెక్టుకు నిధులు..**

పోలవరం ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిందని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం రూ.500 కోట్లకుపైగా నిధులు ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించింది. పోలవరం, అమరావతికి కలిపి రూ.3800 కోట్ల వరకు నిధులు వచ్చాయి. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు గ్రాండ్‌గా రాష్ట్రాలకు నిధులు వస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లోనూ జిల్లాల ప్రస్తావన ఉండదు. కానీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల వారీగా కాకుండా మంత్రిత్వ శాఖలకు కేటాయింపులు ఉంటాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన మంత్రులను దృష్టిలో ఉంచుకుని.. అక్కడి పరిస్థితుల ఆధారంగా ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బడ్జెట్ ఉంది. ప్రపంచ అవసరాలకు సరిపడేలా మన దేశంలో యువత ఉన్నారు. మహిళల సాధికారత కోసం ప్రతి జిల్లాలో మహిళలకు హాస్టల్స్ ఏర్పాటు చేస్తుంది. సంప్రదాయ విజ్ఞానం కొనసాగించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు' అని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

**పర్యాటక రంగానికి పెద్దపీట..**

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని ఎంపీ తెలిపారు. 'చేనేత వృత్తులకు ప్రోత్సాహం కల్పించేలా ఓడీఓపీ ద్వారా చేతివృత్తుల వారికి లాభం చేకూరుతుంది. రాజమండ్రి, కాకినాడతో సహా నగరాల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో, జీడి మామిడి రైతులకు ప్రోత్సాహం అందించేలా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో ఉంది. అనంతపురంలో మోనోజైట్ నిక్షేపాలు ఉన్నాయి. శ్రీకాకుళం, నెల్లూరులో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే మినరల్స్ ఏపీలో ఉన్నాయి. వికసిత భారత్ కావాలంటే వికసిత ఆంధ్రప్రదేశ్ కావాలి.. వికసిత రాష్ట్రాలు కావాలి.. ఆ దిశగా కేంద్ర బడ్జెట్ ఉంది' అని ఎంపీ చెప్పారు.

# కీర్తి శేషులు అర్జున రావు వర్ధంతి. అన్నదానం



**బిక్కవోలు క్రైం కౌంటర్ పిబ్రవరి 2** విశాఖపట్నం కు చెందిన కీర్తి శేషులు సొర్నపూడి అర్జునరావు వర్ధంతి సందర్బంగా ఈ రోజు సోమవారం వారి కుమారులు శ్రీనివాస రావు, సతీష్ లు బిక్కవోలు మండలం బలభద్రపురం కె అర్ కె సంక్షేమ చారిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు మూడు పూటలా అన్నదానం జరిపించి వారి ఆకలి తీర్చారు. ఈ అన్నదానం లో పాల్గొని ఆకలి తీర్చుకొన్న వృద్ధులు "అన్నదాత సుఖీభవ "అని స్వర్గీయ అర్జునరావు ఆత్మ శాంతి కోసం ప్రార్ధన చేశారు. స్వర్గీయ అర్జున రావు కుమారుడు శ్రీనివాసరావు బిక్కవోలు మండలం కొమరిపాలెం లోని మురళి మోహన రైస్ మిల్లు నందు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నారు. ఆయనకు అన్నదానం చెయ్యడం అంటే ప్రీతి. ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడంలో ఉన్న తృప్తి మరేందులో లేదని అయన అంటూ ఉంటారు. అనేక పర్యాయాలు ఈ ట్రస్ట్ లో జరిగే అన్నదానం కు సహాయంగా నిలబడి శ్రీనివాసరావు మానవత్వం చాటుకొన్నారు. తండ్రి పై ప్రేమ, తన భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించిన తండ్రి జ్ఞాపకాలు మరువలేనివి. అనుక్షణం తండ్రి జ్ఞాపకాలతో నిండిన హృదయం తో అన్నదానం చేస్తున్న శ్రీనివాస్రావు కు కె అర్ కె ట్రస్ట్ చైర్మన్ కర్రి రామ కృష్ణా రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ స్వర్గీయ అర్జునరావు ఆత్మ శాంతి కోరుతూ శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

# డి.హెచ్.ఓ కు స్వస్థత ఆసుపత్రి ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



**ప్రకాశం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** జిల్లా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సాయి తేజ, డాక్టర్ ప్రదీప్ లు సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ విజయలక్ష్మి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 4వ తేదీన గుంటూరు అమరావతి రోడ్డులో నూతనంగా ప్రారంభించనున్న స్వస్థ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆమెకు అందజేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్వస్థ హాస్పిటల్ ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా డాక్టర్ సాయి తేజ, డాక్టర్ ప్రదీప్ లు డీఎంహెచ్ఓ విజయలక్ష్మి గారికి వివరించారు.

# ఎమ్మెల్యే మాధవి కు ఆహ్వాన పత్రిక అందజేత!




**ప్రకాశం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సాయి తేజ, డాక్టర్ ప్రదీప్‌లు వెస్ట్ గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 4వ తేదీన గుంటూరులో ప్రారంభోత్సవం కానున్న స్వస్థ హాస్పటల్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యేను వారు ఆహ్వానించారు. వైద్యుల ఆహ్వానానికి స్పందించిన ఎమ్మెల్యే గల్లా మాధవి, హాస్పటల్ ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతానని వారికి హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో స్వస్థ హాస్పటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె కొనియాడారు. ముఖ్యంగా సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వైద్య రంగంలో సేవాభావంతో ముందుకు వచ్చే ప్రతి ప్రయత్నానికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే గల్లా మాధవి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గుంటూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు స్వస్థ హాస్పటల్ ఎంతో ఉపయోగకరంగా మారాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో హాస్పటల్ నిర్వహణ, భవిష్యత్‌లో అందించనున్న వైద్య సేవలపై వైద్యులు ఎమ్మెల్యేతో వివరంగా చర్చించారు.

# సినిమా



## ఈ జబర్దస్త్ కమెడియన్ గ్రేట్ అబ్బా!

జబర్దస్త్ కామెడీ షో ఎంతో మందికి జీవితాన్ని ఇచ్చింది. పేదరికంలో మగ్గుతున్న వారిని కోటీశ్వరులుగా మార్చేసింది. గతంలో జబర్దస్త్ లో స్కిట్స్ చేసిన సుడిగాలి సుధీర్, బలగం వేణు, రామ్ ప్రసాద్, గెటప్ శీను, రాకింగ్ రాకేష్, ధనాధన్ ధన్ రాజ్, అదిరే అభి, జీవన్, రాకెట్ రాఘవ తదితరులు ఇప్పుడు సినిమాలతో బిజీగా ఉంటున్నారు. హీరోలు, సహాయక నటులుగా, కమెడియన్లుగా, నిర్మాతలుగా, డైరెక్టర్లుగా దూసుకుపోతున్నారు. అంతేకాదు వీరు ఇప్పుడు తమ ట్యాలెంట్ కు తగ్గట్టుగానే రెమ్యునరేషన్లు తీసుకుంటున్నారు. ఒకప్పుడు తినడానికి తిండి కూడా లేక ఇబ్బందులు పడిన వారు కూడా ఇప్పుడు కోటీ శ్వరులుగా సెలబ్రిటీ లైఫ్ ను ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక జబర్దస్త్ కమెడియన్ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కోసం ఒక మంచి పని చేసి అందరి మన్ననలు అందుకుంటున్నాడు. రోడ్డు సౌకర్యం లేని తన సొంతూరిలో తల్లిదండ్రులకు రూ. 2 కోట్లు ఖర్చు పెట్టి ఇల్లు కట్టించాడు. ఇంతకీ అతనెవరు? పల్లెటూరిలో అంత ఖర్చుపెట్టి ఎందుకు ఇల్లు కట్టించాడో తెలుసుకుందాం రండి.

జబర్దస్త్ కామెడీ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో చమ్మక్ చంద్ర ఒకడు. అతని స్కిట్స్ కు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ముఖ్యంగా లేడీ గెటప్పుల్లో చమ్మక్ చంద్ర చేసిన సందడిని ఎవరూ అంత ఈజీగా మర్చిపోలేరు. ప్రస్తుతం వెండితెరపై కమెడియన్ గా, సహాయక నటుడిగా మెరుస్తోన్న చమ్మక్ చంద్ర ఆ మధ్యన ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇదే సందర్భంగా తన తల్లిదండ్రుల గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యాడు.'నా చిన్నప్పటి నుంచి అమ్మానాన్న కష్టపడటమే నేను చూశాను. అందుకే ఆ ఊర్లోనే వాళ్లు ఉన్నంత వరకూ హ్యాపీగా ఉండానుకున్నాను. ఏ లోటు లేకుండా హాయిగా ఉండాలనుకున్నాను. అందుకే రూ. 2 కోట్లు ఖర్చు పెట్టి మా ఊరిలోనే ఇల్లు కట్టాను. ఇప్పటికీ.. మా ఊరికి కనీసం బస్సు సౌకర్యం కూడా లేదు' అని చమ్మక్ చంద్ర చెప్పుకొచ్చాడు.





## ఆరోగ్యానికి అమృతం లాంటి పండు.

మనం సపోటాను సాధారణ పండుగానే తీసుకుంటాం. కానీ, సపోటా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. పోషకాలతో నిండిన ఈ పండు మనకు చాలా సులభంగా దొరుకుతుంది. దుకాణాల్లోనే కాదు, చాలా ఇళ్లలో కూడా ఇది సాధారణంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిరోజూ సపోటా తింటే కలిగే లాభాలు

మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. వారానికి కనీసం మూడు సార్లు సపోటా తినడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

గుండె ఆరోగ్యానికి మేలు

సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కంటి చూపు, చర్మ సంరక్షణకు ఉపయోగకరం

కంటి సమస్యలు ఉన్నవారికి సపోటా మంచి ఆహారంగా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఇూ కంటి చూపును మెరుగుపరుస్తుంది. అదేవిధంగా, విటమిన్ చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మెరిసేలా ఉండేందుకు సపోటా తోడ్పడుతుంది.

రోగనిరోధక శక్తి పెరుగుదల

సపోటాలో విటమిన్ , యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ అలసట, నీరసం అనుభవించే వారికి ఇది మంచి శక్తినిచ్చే పండు. రోజూ సపోటా తినడం వల్ల శరీరం ఉత్సాహంగా ఉంటుంది.

రోజుకు ఎన్ని సపోటా తినాలి?

నిపుణుల సూచనల ప్రకారం, రోజుకు 1 నుంచి 2 మధ్యతరహా సపోటాలు తినవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో, వైద్యుల సలహాతో సపోటాను తీసుకోవచ్చు. మొత్తానికి, తక్కువ ఖర్చుతో సులభంగా లభించే సపోటా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, మీ రోజువారీ ఆహారంలో ఈ పోషక విలువల పండును తప్పక చేర్చుకోండి.



## ఇదీ తులసి రహస్యం..

తులసి మొక్కలో పోషకాలతోపాటు అపారమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. హిందూ సంస్కృతిలో పవిత్రమైనదిగా పూజిస్తారు. తులసి ఆకులు, కాండం, వేరుతో సహా అన్ని భాగాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తులసిని అడాప్టోజెన్‌గా పరిగణిస్తారు.. ఇది మీ శరీరం ఒత్తిడికి అనుగుణంగా, మానసిక సమతుల్యతను ప్రోత్సహించే ఒక సహజ పదార్థం. శరీరం సాధారణ స్థితికి తీసుకు రావడానికి సహాయపడే ప్రత్యేకమైన మూలికల మొక్కగా అభివర్ణిస్తారు.. ఆధునిక జీవనశైలిలో పెరిగిన ఒత్తిడిని తగ్గించడంలో ఇది చాలా సహాయపడుతుంది. అందుకే.. దీనిని ఔషధ గుణాలకు నిలయంగా పేర్కొంటారు.. ఉదయాన్నే తులసి ఆకులు రెండు తిన్నా.. టీ లేదా కషాయం తాగినా మంచిదని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు.. శరీరం నిర్విషీకరణ.. తులసిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి, హానికరమైన విష రసాయనాల నుండి రక్షిస్తాయి. కొన్ని పరిశోధనల ప్రకారం.. తులసి క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది. తులసి సారం గాయాలను వేగంగా నయం చేయగలదని, వాటి బలాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, శోథ నిరోధక, అనాల్జేసిక్ (నొప్పి నివారణ) లక్షణాలతో, ఇది అంటువ్యాధులకు, గాయాలకు వ్యతిరేకంగా సమర్థవంతంగా పోరాడుతుంది. నోటి పూతలు, కెలాయిడ్లు, పెరిగిన మచ్చలు, మొటిమలను కూడా నివారించడంలో తులసి తోడ్పడుతుంది.

డయాబెటిస్ నియంత్రణ.. రక్తంలో చక్కెర నియంత్రణలో తులసి కీలక పాత్ర పోషిస్తుంది. ప్రీ-డయాబెటిస్ లేదా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి, తులసి మొక్కలోని పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది బరువు పెరుగుట, అధిక ఇన్సులిన్, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత, రక్తపోటును తగ్గించడంలో కూడా దోహదపడుతుంది. తులసి జీవక్రియ ఒత్తిడిని లక్ష్యంగా చేసుకుంటుంది.. తద్వారా బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తాయి.. తులసిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఒత్తిడి, ఆందోళన, మంటను ఎదుర్కోవడానికి సహాయపడతాయి. ఆర్థరైటిస్ లేదా ఫైబ్రోమయాల్జియా వంటి కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఇది ఉపశమనం కలిగిస్తుంది.

## భారత్-పాక్ మ్యాచ్ లేకపోతే క్రికెట్ దివాళా..

పాకిస్థాన్ ప్రభుత్వం తీసుకున్న ఒక్క మొండి నిర్ణయం ఇప్పుడు యావత్ క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాక్ ప్రకటించడంతో సుమారు రూ.4500 కోట్ల భారీ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఒకానొక దశలో ఈ నష్టం గ్లోబల్ క్రికెట్ ఎకానమీని కుప్పకూల్చేలా ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఫిబ్రవరి 15న శ్రీలంకలో జరగాల్సిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ రద్దయితే ఎవరెవరికి ఎంత నష్టమో వివరంగా తెలుసుకుందాం.

భారత్ మరియు పాకిస్థాన్ మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్ కేవలం ఆట మాత్రమే కాదు, అదొక భారీ వాణిజ్య సామ్రాజ్యం. ఫిబ్రవరి 1న పాక్ ప్రభుత్వం టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో ఆడబోమని చేసిన ప్రకటన ఇప్పుడు ఐసీసీని, బ్రాడ్‌కాస్టర్లను నిద్రపోనివ్వడం లేదు. ఈ ఒక్క మ్యాచ్ విలువ సుమారు 500 మిలియన్ డాలర్లు (రూ.4500 కోట్లు) అని అంచనా. ఇందులో బ్రాడ్‌కాస్టింగ్ హక్కులు, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ల అమ్మకాలు అన్నీ కలిసి ఉన్నాయి.

ఈ మ్యాచ్ కోసం ప్రకటనల రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. కేవలం 10 సెకన్ల అడ్వర్టైజ్‌మెంట్ స్లాట్ ధర రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉంది. ప్రపంచకప్ మొత్తంలో ఇదే అత్యంత ఖరీదైన స్లాట్. ఈ మ్యాచ్ గనుక జరగకపోతే, కేవలం ప్రకటనల ద్వారా వచ్చే రూ.300 కోట్ల ఆదాయాన్ని బ్రాడ్‌కాస్టర్లు కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జియోస్టార్ వంటి దిగ్గజ సంస్థలు ఐసీసీని దీనిపై వివరణ కోరుతున్నాయి.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం ఐసీసీ నుంచి ఏటా 5.75% రెవెన్యూ షేర్ అందుకుంటోంది. అంటే సుమారు రూ.316 కోట్లు. ఒకవేళ పాక్ గనుక భారత్‌తో మ్యాచ్ ఆడకుండా వాకౌట్ చేస్తే, ఐసీసీ ఈ నిధులను నిలిపివేసే అవకాశం ఉంది. ఇది పాక్ క్రికెట్ బోర్డుకు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, మ్యాచ్ రద్దయితే భారత్, పాక్ బోర్డులకు చెరో రూ.200 కోట్ల ప్రత్యక్ష నష్టం వాటిల్లుతుంది. భారత్ ఈ నష్టాన్ని తట్టుకోగలదు కానీ, ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్‌కు ఇది ఆత్మహత్యాసదృశ్యమే.

భారత్-పాక్ మ్యాచ్ ఎక్కడ జరిగినా స్టేడియాలు కిక్కిరిసిపోతాయి. ఫిబ్రవరి 15 మ్యాచ్ కోసం ఇప్పటికే లక్షలాది టికెట్లు అమ్ముడయ్యాయి. మ్యాచ్ రద్దయితే నిర్వాహకులు అభిమానులకు టికెట్ డబ్బులను రీఫండ్ చేయాల్సి ఉంటుంది. ఇది కూడా వందల కోట్ల నష్టంతో కూడుకున్న పని. ఐసీసీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒక ముందస్తుగా ప్రకటించిన బహిష్కరణ ఇప్పుడు గ్లోబల్ క్రికెట్ వ్యవస్థను ప్రమాదంలోకి నెట్టింది.

పాకిస్థాన్ నిర్ణయంపై ఐసీసీ తీవ్రంగా స్పందించింది. "ప్రపంచ క్రీడల స్ఫూర్తికి ఇది విరుద్ధం" అని పేర్కొంటూనే, పాక్ క్రికెట్ భవిష్యత్తుపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. బహుశా పాకిస్థాన్‌ను భవిష్యత్తు టోర్నీల నుంచి నిషేధించడం లేదా భారీ జరిమానాలు విధించడం వంటి చర్యలు ఉండవచ్చు. వచ్చే 24 గంటల్లో పాక్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, క్రికెట్ ప్రపంచంలో ఒక భారీ ఆర్థిక విపత్తు తప్పేలా లేదు.



## వార్మప్ మ్యాచులోనే సెంచరీ కొడితే.

టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందే భారత కుర్రాళ్లు మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించారు. అమెరికాతో జరిగిన తొలి వార్మప్ మ్యాచ్‌లో ఇండియా-ఎ బ్యాటర్లు సిక్సర్ల వర్షం కురిపించారు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి సెంచరీ బాదాడు. కెప్టెన్ ఆయుష్ బదోని, తిలక్ వర్మ కూడా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరును సాధించింది. నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నారాయణ్ జగదీశన్ బ్యాటింగ్ హైలైట్‌గా నిలిచింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన జగదీశన్, అమెరికా బౌలర్లను ఒక ఆట ఆడుకున్నాడు. కేవలం 49 బంతుల్లోనే 100 పరుగులు పూర్తి చేసి తన ఫామ్‌ను చాటుకున్నాడు. అతని మొత్తం ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి. 54 బంతుల్లో 104 పరుగులు చేసిన జగదీశన్, టీ20 ప్రపంచకప్ మెయిన్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోలేకపోయినా, భవిష్యత్తులో తన స్థానం సుస్థిరమని సెలెక్టర్లకు స్ట్రాంగ్ మెసేజ్ పంపాడు.

సర్జరీ కారణంగా కొన్నాళ్లు ఆటకు దూరమైన తెలుగు తేజం తిలక్ వర్మ, ఈ మ్యాచ్‌తో మైదానంలోకి అడుగుపెట్టాడు. ఫిట్‌నెస్ నిరూపించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన తిలక్, ఏమాత్రం తడబడకుండా ఆడాడు. కేవలం 24 బంతుల్లో 38 పరుగులు చేసి అలరించాడు. ఇందులో 3 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. తిలక్ బ్యాటింగ్ చూస్తుంటే అతను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడని అర్థమవుతోంది. దీంతో ప్రపంచకప్ మెయిన్ టోర్నీలో అతను టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండటం ఖాయమైంది.జట్టు కెప్టెన్ ఆయుష్ బదోని క్రీజులోకి రాగానే మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన బదోని, అమెరికా బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. 4 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 26 బంతుల్లోనే 60 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కూడా 13 బంతుల్లో 28 పరుగులతో మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. వీరి విధ్వంసకర ఇన్నింగ్స్‌ల వల్ల ఇండియా-ఎ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 238 పరుగుల పర్వత సమానమైన స్కోరును బోర్డుపై ఉంచింది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.